

# మానస మయూరి

## – కస్తూరి మురళీకృష్ణ



(గత సంచిక తరువాయి)

**చాలాసేపు** ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

‘ఇక ఇక్కడ ఉండి ఏం చేస్తాం? వెళ్లిపోదాం‘ ఇంటికి అన్నాడు శరత్ లేస్తూ.

మౌనంగా అతడివైపు చూసింది ప్రశాంతి. నిట్టూర్చి అంది ‘ఇంటికి వెళ్ళి ఏం చేస్తాం? ఎక్కడికయినా వెళ్ళి ఏం చేస్తాం? అసలు ఇంతకాలం బ్రతికి ఏం సాధించాం? అసలు ఏం సాధించాలి?‘ అంది నిస్పృహగా.

ఆమె దగ్గరగా వెళ్ళి ఆమెని పొదవి పట్టుకున్నాడు శరత్.

ఇద్దరూ ఒకరి స్పర్శలోని ఆత్మీయతానురాగాలను మరొకరు అనుభవిస్తూ మౌనంగా ఉన్నారు.

‘ఇది మన ఇంట్లోనే జరగాలా? ఇద్దరూ ఇలా మతాలు మారిపోవాలా?‘

హఠాత్తుగా అడిగింది ప్రశాంతి.

‘ఒక్క స్రవంతి మతం మారింది. సుమంత్ మారలేదు కదా?‘ అన్నాడు శరత్.

నీళ్ళు నిండిన కళ్ళతో అతడివైపు చూసింది ప్రశాంతి.

‘సుమంత్ కూడా మారతాడు. మన ఆడపిల్లలు వేరే మతం వారిని చేసుకుంటే వాళ్ళు భర్త మతంలోకి మారతారు. మన మగపిల్లలు వేరేవారిని చేసుకుంటే, వాళ్ళు భార్య మతం స్వీకరిస్తారు. లేకపోతే ఆడపిల్లలు వీళ్ళతో పెళ్ళికి ఇష్టపడరు.‘ అంది ప్రశాంతి నిర్లిప్తంగా.

‘అలా ఏం లేదు.. నాకో ఫ్రెండున్నాడు. వాడు మతం మారలేదు. అమ్మాయి మతం మారితే ఎవరి మతం వాళ్ళు అవలంభిస్తున్నారు. కలసి ఉంటున్నారు. అయినా మనసులు కలసిన తరువాత మతం ప్రసక్తి ఏముంది? ఏ మతమైనా ప్రార్ధించేది దైవాన్నే కదా! కృష్ణ అనే బదులు క్రీస్తు అంటారు. రామ్ అనే బదులు రహీమ్ అంటారు. అంతే కదా‘ తేలికగా అన్నాడు శరత్.

పైకి ప్రశాంతి బాధను తగ్గించటం కోసం తేలికగా మాట్లాడుతున్నాడు కానీ అతని మనస్సులో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నాయి.

తాను బాధపడుతున్నట్టు కనిపిస్తే ప్రశాంతి మరింత బాధ పడుతుందని అతడికి తెలుసు.

‘మీకు అర్థం కాదులెండి. ఆడపిల్లలకు సులభంగా ఈ బాధ తెలుస్తుంది. పెళ్ళికి ముందరి జీవితాన్ని సర్వం వదిలి పెళ్ళయిన తరువాత భర్త దగ్గర పూర్తిగా నూతన జన్మ ఎత్తినట్టు కొత్త జీవితం ఆరంభించాల్సి వస్తుంది. ఆ బాధ మీ మగవాళ్ళకు అర్ధంకాదు. మీ ఊహకు కూడా అందదు‘ నిష్కర్షగా అంది ప్రశాంతి.

శరత్ మాట్లాడలేదు. పెళ్ళయినప్పటి నుంచి అతడు ఈ విషయమే ఆలోచిస్తున్నాడు. ఒక రకంగా ఈ ఆలోచననే అతడికి ప్రశాంతి పట్ల ప్రేమను మరింతగా పెంచింది.

'ఎంత నమ్మకంతో ఓ యువతి తనవారందరినీ వదులుకుని అత్తగారింటికి వస్తుందో!' తలచుకుంటే అతడి ఒళ్ళు జలదరిస్తుంది తనని ఆమె పరిస్థితిలో ఊహించుకుంటే భయం వేస్తుంది. తాను తనకు అలవాటయిన పరిస్థితులు, పద్ధతులు తప్ప మరో స్థలంలో ఉండలేడు. అందుకే ఎవ్వరి ఇంటికీ వెళ్ళడు. వెళ్ళినా ఎక్కువసేపు ఉండడు. రాత్రిళ్ళు అసలు ఉండడు. వేరే ఊరు వెళ్తే బంధువులు ఉన్నా హోటల్‌లో గది తీసుకుని ఉంటాడు. అలాంటిది, అన్నీ వదులుకుని పరిచయం లేని ఇంట్లో, పరిచయం లేని మనుషుల నడుమ, పరిచయం లేని పద్ధతులలో ఒక యువతి ఇమిడిపోవటం ఎంత అద్భుతం! ఎంత బాధాకరం! ఎంత ఓపిక, సమన్వయం, అవగాహనలు కావాలి.

'రిటర్న్ జర్నీ గురించి ఆలోచించండి' అంది ప్రశాంతి.

'వాడి ఆత్మహత్య నాటకం అట. అమ్మాయిని గెలుచుకోవటం కోసం ఆడిన సినిమాటిక్ నాటకం' చెప్తాడు శరత్.

'మన పిల్లలు ఇలా ఎందుకు తయారయ్యారు? మనం వాళ్ళకి ప్రేమను ఇచ్చాం. అనురాగాన్ని అందించాం. మంచి బుద్ధులు నేర్పించాం. ఇలా ఎలా అయ్యారు? కనీసం వేరే వాడిని పెళ్ళి చేసుకునే ముందు అమ్మాయికి మన గురించిన ఆలోచన రాలేదు. ఆత్మహత్య నాటకం ఆడే ముందు వాడికి ఆ వార్త మనమీద ఎలాంటి ప్రభావం చూపిస్తుంది, ఎంత బాధ కలిగిస్తున్నాం అన్న ఆలోచన రాలేదు' అంది ప్రశాంతి బాధగా.

'అది మన పెంపకంలో లోపం కాదనిపిస్తుంది నాకు. అది మన సమాజంలోనే నెలకొని ఉన్న పరిస్థితి.'

'అయితే అందరు పిల్లలు ఇలా ఎందుకు కావటంలేదు? మన పిల్లలే ఇలా ఎందుకవుతున్నారు?' కోపంగా అడిగింది ప్రశాంతి.

'ఎవరికి వాళ్ళకి అలా అనిపిస్తుంది. కానీ గమనించి చూస్తే అధికశాతం ఏదో ఓ సమస్యకు గురికావటం కనిపిస్తుంది. దీనికి లోపం మనలో కూడా ఉంది. మన చుట్టూ ఉన్న సమాజంలో కూడా ఉంది. తన చుట్టూ ఉన్న పరిస్థితులలో స్పందించే వ్యక్తి వ్యక్తిత్వంలో ఉంది. ఒకే పరిస్థితికి వేర్వేరు వ్యక్తులు వేర్వేరుగా స్పందిస్తారు. దానికి మనం చూపిన ప్రేమ, నేర్పిన సంస్కారం మాత్రమేకాదు, వారి వారి వ్యక్తిత్వం కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. కాబట్టి మనం సరిగ్గా పెంచలేదనో, సరిగ్గా దిశానిర్దేశనం చేయలేదనో బాధపడి లాభంలేదు. '

'కర్మ సిద్ధాంతం చెప్తున్నారు. ఇంతేగా?'

'అంతే.. లేకపోతే, ఒకే ఇంట్లో ఒకే వాతావరణంలో పెరిగిన వారు వేర్వేరు అదృష్టాలతో ఎలా ఎదుగుతున్నారు? కాబట్టి మంచిగా పెంచటం, చెడుగా పెంచటం అంటూ ఏమీ ఉండదు. ఎవరి అదృష్టం వారిది.'

'మన అదృష్టం ఇంతే అంటారు' అంది నవ్వుతూ.

**'దర్ద్ భీ హమే కుబూల్, చైన్ భీ హమే కుబూమ్!**

**హమ్ నె హర్ తరహ్ కె ఫూల్ హార్ మే పిరోలియే!'**

సన్నగా పాడాడు శరత్.

'మాకు అర్థంకాని కొటేషన్లిచ్చి చంపుతారెందుకు? పండితులు సంస్కృతం శ్లోకాలు చదివితే మీరు హిందీ పాటలు పాడతారు. ఏదైనా మాకు అర్థంకాదు' అంది నవ్వుతూ.

'అంటే బాధనయినా స్వీకరిస్తాను. శాంతినయినా స్వీకరిస్తాను. నేను ఏ రకమయిన పుష్పాన్నయినా మాలగా కట్టుకుంటాను. ధరిస్తాను' అని అర్థం.

'బాగుంది. అందరూ మీలా ఏది దొరికితే అదే అదృష్టం అనుకుంటే. ఇక ఈ ప్రపంచం ఎందుకు ఈ ఆరాటాలు, పోరాటాలు ఎందుకు? ఈ ప్రగతి, సాంకేతికత, పరిజ్ఞానం ఎందుకు?'

'అందరూ అలా అనుకోలేదు కాబట్టే ప్రపంచం నడుస్తోంది, ఆరాటాలు, పోరాటాలు మధ్య. కానీ ప్రశాంతంగా ఉండాలంటే ఇదీ మార్గం. ఎవరి సంస్కారాన్ని బట్టి వాళ్ళు ప్రవర్తిస్తారు' అన్నాడు శరత్.

'బాగుంది. ఇంటికి వెళ్ళే తయారీలు చేయండి' ఆమె అంటూండగానే ఫోను మోగింది.

శరత్‌కి ఫోను దగ్గరగా ఉండటంతో ఫోను తీశాడు.

'హలో' అన్నాడు.

'నాన్నా' అవతల స్రవంతి గొంతు వినిపించింది.

స్రవంతి 'నాన్న' అనగానే 'ఏమ్మా' అనటం శరత్‌కి అలవాటు. అలవాటు ప్రకారం 'ఏమ్మా' అన్నాడు.

'నాన్నా, నేను ఎల్లుండి సాయంత్రం ఇంటికి వస్తాను.' చెప్పింది.

'సరే'.. అన్నాడు శరత్.

'నాన్నా.. అమ్మకి నేను చెప్పాను.. నీకు చెప్పిందా?' అడిగింది.

'ఏమిటి?'

'అదే...' నీళ్ళు నమిలింది స్రవంతి.

'ఏమిటి?' రెట్టించాడు శరత్.

'అదే.. దేవుళ్ళ పటాలు..' నసిగింది స్రవంతి.

'స్రవంతీ. అది మన ఇల్లు.. ఎలాంటి కండిషన్లు, షరతులు లేకుండా నువ్వు రావచ్చు. నీకు తెలుసు. నేను ఎవరి ఇష్టానికి అడ్డుపెట్టను. కానీ ఎవరి ఇష్టాన్నీ నాపై రుద్దటం సహించను' సౌమ్యంగా కఠినంగా ధ్వనించింది శరత్ స్వరం.

ఆవైపు కాస్సేపటి నిశ్శబ్దం తరువాత ఫోను 'కట్' అయింది.

ప్రశాంతివైపు చూశాడు శరత్. ఆమె కళ్ళల్లో నీళ్ళున్నాయి.

'పోనీ, దానికి అంతకష్టమైతే దేవుళ్ళ పటాల మీద ఏదైనా బట్ట కప్పుతాను రమ్మనండి' అంది ప్రశాంతి.

ఆమెవైపు పరిశీలనగా చూశాడు శరత్.

'ఇది మన బలహీనత. మనం ఎదుటివాడు ఏమనుకుంటాడో అని మన ఇష్టాయిష్టాలను అణచి వాడి ఇష్టానికి తగ్గట్టు ప్రవర్తిస్తాం. కానీ వాళ్ళు తమ ఇష్టప్రకారం ప్రవర్తిస్తారు. ఎవరు ఏమనుకుంటారో అన్నది పట్టించుకోరు. వారు వారిలాగే ఉంటారు. మనం వారికి తగ్గట్టు మారతాం. తరవాత బాధ పడతాం' అన్నాడు.

'మీరు ఎవరిగురించో కాదు మన అమ్మాయి గురించి మాట్లాడుతున్నారు' అంది ప్రశాంతి.

'స్రవంతి మన అమ్మాయి. అందుకే అది తన పాట మరచిపోయి వేరే గూటి పాట పాడుతోంది.' అన్నాడు శరత్.

ప్రశ్నార్థకంగా చూసింది ప్రశాంతి.

'ఎదుటివారి మనోభావాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రవర్తించటం ప్రశంసనీయం. కానీ పూర్తిగా వారికి తగ్గట్టు ప్రవర్తించటం ఆత్మవిశ్వాస రాహిత్యం సూచిస్తుంది. మనం మన పిల్లలకు ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వటంలో విఫలమవుతున్నాం. ఆత్మవిశ్వాస రాహిత్యం వల్ల వారు వేరేవారి ప్రభావానికి గురవుతున్నారు. ఆత్మాభిమానం లేనట్టు ప్రవర్తిస్తున్నారు. ఒకవ్యక్తి మరొకరి ప్రభావానికి గురవుతున్నాడంటే, ఆ ఎదుటివ్యక్తి ఆత్మవిశ్వాసం ఈ వ్యక్తికన్నా అధికం అని అర్థం.'

'కానీ..' ఏదో అడగబోయింది ప్రశాంతి. ఆమెను మాట్లాడనీయలేదు శరత్.

'పిల్లవాడి ఆత్మవిశ్వాసానికి తల్లిదండ్రులు కుటుంబ వాతావరణ తరువాత ప్రభావం చూపించేది సమాజం. ఇక్కడ ఎక్కడ లోపం ఉన్నా అది వ్యక్తిత్వం పై ప్రభావం చూపిస్తుంది. దీన్లో దోషం నీదికాదు, నాది కాదు.' అన్నాడు శరత్.

మళ్ళీ ఫోను మ్రోగింది.

శరత్ ఫోనెత్తి 'హలో' అనగానే 'కట్' అయింది.

కాస్సేపటికి మళ్ళీ ఫోను మోగింది.

ఈసారి ప్రశాంతి ఫోను ఎత్తింది.

'అమ్మా' అంది స్రవంతి.

'ఏంటమ్మా? చెప్పు' అంది ప్రశాంతి కళ్ళల్లో ఉబికి వస్తున్న నీటిని అదుపులో పెట్టుకుంటూ.

'అమ్మా.. నేను ఇంటికి వస్తానమ్మా.. నాన్నకి చెప్పు కొంచెం సర్దుకోమని. నాకేం అభ్యంతరం లేదుకానీ ఆయనకి ఇబ్బంది అమ్మా. అందుకని గంటలకోసం సర్దుకోండమ్మా' అంటూనే స్రవంతి ఏడవటం మొదలు పెట్టింది.

ప్రశాంతి కంటినుండి కూడా నీళ్ళు కారటం ఆరంభమయింది. 'సరేనమ్మా.. నాన్నకు నేను చెప్తాను. మీరు రండి. ఎవరెవరు వస్తారు?' అడిగింది.

'వాళ్ళ అమ్మా, నాన్న, వాళ్ళ పాస్టర్ వస్తారమ్మా... మన ఇల్లు చూసి నీతో, నాన్నతో వాళ్ళు మాట్లాడాలట.'

'సరేనమ్మా..' అని ఫోను పెట్టేసింది ప్రశాంతి. శరత్ వైపు చూసింది.

నవ్వాడు శరత్.

'ఎందుకా నవ్వు?' కోపంగా అడిగింది ప్రశాంతి.

'నేను కొత్త హిందీ సినిమా పాటలల్లో అర్థం లేదని అంటుంటాను. కానీ, ఇప్పుడిప్పుడు అనిపిస్తోంది, కొత్త సినిమా పాటలలో మనకు కనబడని అర్థాలు కొత్త తరానికి కనిపిస్తాయని. వాళ్ళకి సరిపోతాయి.. వాళ్ళకి ఇవే గొప్ప కవితలు'

'ఏమిటా పాట?'

హఠాత్తుగా శరత్ డాన్స్ పోజ్ పెట్టి పాటపాడటం ఆరంభించాడు.

**యే దిల్ పిఘ్లా కె సాజ్ బనాలు, ధడ్కన్ కో ఆవాజ్ బనాయిా**

**స్మోకింగ్ స్మోకింగ్ నిక్‌లేరే ధువా, సీనేమే జల్తీ హై అర్మానోంకీ అర్థీ**

**అరే వాట్ యు టెల్ యూ డార్లింగ్ క్యాహువా**

**అరే సప్నే దేఖే జన్నత్ కా, పర్ మిట్టి మె మిల్ జాయే**

**ఫూలే కి ఘర్ బార్‌కీ దునియాకో బోలో గుడ్‌బై**

**ఛడ్ జాయే హాయ్ అల్లా డిస్కో, భాయే బుఖార్**

**తౌబా తేరా జల్వా, తేరుప్యార్, తేరా ఎమోషనల్ అత్యాచార్'**

**'ఎమోషనల్ అత్యాచార్'ను సాగదీసి సాగదీసి పలికాడు.**

'ఇక్కడ ఎవరు ఎవరిపై ఎమోషనల్ అత్యాచారం చేస్తున్నారు?' అడిగింది ప్రశాంతి.

'అర్థమయ్యేవారికి అర్థమయింది. అర్థంకానివారు అమాయకులు. పద ఇంటికి వెళాం.. దేవుళ్ళపై దుప్పట్లు కప్పాలి. ఇంతకీ కొత్త దుప్పట్లు కొనాలా? పాత దుప్పట్లు సరిపోతాయా?' అడిగాడు శరత్. *(కొనసాగింపు వచ్చే సంచికలో)*